

# వేట

వి.ఆర్. రాసాని

వీధి వైపున తెల్లటిగోడకు దీగూడు... ముత్తయిదువ నొసటన పెట్టుకున్న చుక్కబొట్టులా కనిపిస్తోంది. ఆ దీగూటికి పైన ఒక పెద్ద బల్లి, దానికి కొంత దూరంలో వాలి వున్న ఈగ దాపుకు మెల్లగా జరిగి, చటుక్కున ఆ ఈగను నోట కరుచుకుని చూరు కిందికి పరిగెత్తింది.

ఉదయాన, గుడిసె ముందర కూర్చొని ఆ దృశ్యాన్నే చూస్తున్న వెంకటస్వామి మనసులో ఏదో ఆటవిక న్యాయం తళుక్కుమంది.

ఇంతలో తిరుపతి-మదనపల్లె అన్న బోర్డును ముఖానికంటించుకొని, కంకర తేలిన రోడ్డు మీద దడ దడ శబ్దం చేసుకుంటూ స్పీడుగా పీలేరు వైపుకు వెళ్లిపోయింది ఒక ఆర్టీసీ బస్సు. అది పోయినప్పుడు లేచిన దుమ్ముకు క్షణకాలం కళ్లు మూసుకొని తెరిచాడు వెంకటస్వామి. కంకరరాళ్లతో... బొచ్చు ఊడిపోయిన గజ్జికుక్క చర్మంలా వికారంగా కనిపించింది రోడ్డు.

చాలాసేపట్నుంచీ అతను అక్కడే కూర్చొనున్నాడు. చూస్తుండంగానే తూర్పున పొద్దు బారెడెక్కింది. వచ్చిపోయే వాహనాలతో రోడ్డు సందడిగా మారిపోయింది. ఆ ఊరికి రోడ్డూ అదే, వీధీ అదే.

'వొగబ్బుడు ఈ రోడ్లో గంటకో రెండు గంట్లకో... ఒకటి లెక్కన బస్సులూ లారీలు పోతా వుండె, వస్తా వుండె. యిప్పుడు దీని కతే మారిపాయ,' ఆ రోడ్డును చూస్తూ అనుకున్నాడతను.

ఆ రోడ్డు కానుకొని ఒకవైపున యాభైదాకా గుడిసెలున్నాయి. వాటన్నిటికీ కలిపి 'బాటకాడపల్లె' అని పేరు.

గత గవర్నమెంటు ఆ పల్లెలో సగంమందికి రోడ్డు కవతల ఎడంగా, కాలనీ యిండ్లు కట్టించింది. మిగిలిన సగంమందికి రెండో విడతలో కట్టిస్తామని హామీ ఇచ్చింది. ఇంతలో ఆ గవర్నమెంటు ఎన్నికల్లో ఓడిపోయి గద్దె దిగడం, కొత్త ప్రభుత్వం పరిపాలనలోకి రావడం, ఆ విషయాన్ని అధికారులు మరచిపోవడం కూడా ఎప్పుడో జరిగిపోయింది. ఇదేమి న్యాయం అని అడిగితే మాత్రం తప్పకుండా కట్టిస్తాం అంటున్నారేగానీ కట్టించింది లేదు. కట్టిచ్చిన ఆ యిండ్లకయినా సరయిన గాలిగానీ, వెలుతురుగానీ లేవు. నాసిరకం కట్టడాలు. అవి ఎప్పుడు కూలిపోయి నెత్తినబడతాయోనన్నట్లున్నాయి. అందువల్ల ఒకరిద్దరు తప్ప ఆ యిండ్లలోకి ఎవ్వరూ పోలేదు. వాళ్లకు తమ గుడిసెల్లో వున్నంత స్వేచ్ఛ ఆ పక్కా యిండ్లల్లో లేకపోయింది. 'అక్కడ ఒక యిల్లయినా సంపాదించలేకపోయాను గదా,' అని రోజుకొకసారయినా అనుకుంటుంటాడు వెంకటస్వామి.

ఆతనికి యాభైయుండవచ్చు. అక్కడక్కడా నెరిసిన జుట్టుతో, బక్కచిక్కిన శరీరంతో, నల్లగా... చూస్తూనే కష్టాల్లో పుట్టి, కష్టాలతో కాపురం చేస్తున్నట్లుంటాడు. ఆతనికి నలుగురు సంతానం.

ఆతని పెద్దకొడుకు పన్నెండేండ్ల కిట్టప్ప, ఎనిమిదేండ్ల తమ్ముడితో కలిసి వీధిలో కూర్చొని ఆడుకుంటున్నాడు.

చుట్టింట్లో... చిరిగిన గుడ్డకు మాసికలేసి కుట్టుకుంటూ కూర్చోనుంది వెంకటస్వామి భార్య పెద్దగంగి. ఆమె వడిలో కూర్చొని రొమ్ము చప్పరిస్తోంది చిన్నబిడ్డ. దానికయిదేండ్లొచ్చినా అమ్మ రొమ్ము చప్పరించడం మాత్రం పోలేదు.

తల్లి చించి యిచ్చిన పాత చీరగుడ్డను పైటగా వేసుకుని పెరట్లో ముఖం కడుక్కుని, పైటతో తుడుచు

కుంటూ వచ్చి, వీధి పక్కనున్న గూట్లో నుంచి చాదు చిప్ప తీసుకుని, అందులో రెండు నీళ్లచుక్కల్ని వేసి వేల్తో సాది, అద్దంముక్కలో ముఖం చూసుకుంటూ నొసటన బొట్టు పెట్టుకొని మళ్లీ యింట్లోకి వెళ్లిపో యింది పదమూడేళ్ల శాంతమ్మ. శాంతమ్మ ఆ యింటికి మొదటి సంతానం.

శాంతమ్మ బాకరాపేటలో ఒక టీచర్ యింట్లో పాచిపనులు చేస్తూ వుండేది. అన్ని పనులు చేస్తే... నెలకు వంద రూపాయలిచ్చే వాళ్లు. రాత్రిళ్లలో మిగిలి పోయిన అన్నం యిచ్చేవాళ్లు. వాళ్లిచ్చే ఆ అన్నంలోనే అన్ని నీళ్లుపోసి ఉప్పేసి కలిపి తలా గ్లాసుడిచ్చేది పెద్ద గంగి. అయితే శాంతమ్మ ఆ పని మానేసి రెండు నెలలు కావస్తోంది. దానికి కారణం... ఒకరోజు ఆ టీచరింటికి చుట్టపుచూపుగా ఒక బంధువులామె దిగింది. దిగీ దిగ గానే శాంతమ్మను, ఆ బిడ్డ చేస్తున్న పనిని ఎంతో మెచ్చు కుంది. బిడ్డె బుద్ధిమంతురాలు అని పొగిడింది. ఎంతో కలుపుగోలుగా అదీ యిదీ మాట్లాడుతూ శాంతమ్మను, 'మీరేమిటోళ్లు,' అని అడిగింది. 'మేం యానాదోళ్లం,' అని తటపటాయిస్తూనే చెప్పింది శాంతమ్మ. ఆ మాట వినగానే ఆ యమ్మ, "యానాదోళ్లు కక్కసులెత్తేవోళ్లు. వాళ్లను యింట్లోకే రానియ్యం. అట్టాంటిది యానాది పిల్లచేత పని చేయించుకొని, అది ముట్టుకున్న బోకుల్లో యెట్లా అన్నం వండతా వుండారు? కంచాల్లో యెట్లా తింటా వుండారు? తుఁ... తుఁ... వాక్," అనిందంట. అంతే, దెబ్బతో శాంతమ్మను యింటికి పంపించేశారు.

ఆ విషయాన్నే ఆలోచిస్తూ వీధిలోకి అలాగే చూస్తుండిపోయాడు వెంకటస్వామి.

వీధిలో దూరంగా కొందరు పిలకాయలు కోల కట్టెల్ని వంచి, తాళ్లు కట్టి 'విల్లంబులు' తయారుచేసి, మూరెడు పొడవున్న సన్నని జొన్నకర్రల్ని అంబులుగా చేసి ఆకాశంలోకి వదుల్తూ ఆనందిస్తున్నారు. వాళ్లల్లో చాలామందికి బాగా మురికిపట్టిపోయి నల్లబడిన కాకి నిక్కర్లు తప్ప చొక్కాలసలే లేవు.

చిన్న గొట్టిగల్లు నుంచి వస్తున్న ఒక స్కూటర్ స్పీడుగా, ఆ పిల్లల్ని తప్పించుకుంటూ బాకరాపేట వైపుకు వెళ్లిపోయింది. దూరంగా వున్న కాలనీ ఇండ్లల్లో నుంచి ఒక వ్యక్తి ఆ రాళ్ల దారెంట సైకిల్ తొక్కుకుంటూ రోడ్లోకి దిగబడ్డాడు. ఆ యిండ్ల సందులో నుంచీ పై గుడ్డతో మూతి తుడుచుకుంటూ, ఆ సైకిల్‌కి దారిచ్చి నడుచుకుంటూ వచ్చాడు బీరిగాడు.

"ఏమ్మామా, తీరుబాటుగా కూసోనుండావు?" వెంకటస్వామికి సమీపంగా వస్తూనే అడిగాడు బీరి గాడు.

"చేసేదానికేం పనులుండాయిరా," నిర్లిప్తంగా సమాధానం చెప్పి, "నువ్వేడికి యెలబారినావు?" అంటూ ప్రశ్నించాడు వెంకటస్వామి.

"ఇంట్లో బొత్తిగా దాన్నెమైపోయిండాది మామా. అట్ల పేటకన్నా పోతే కూలిపనన్నా దొరుకుతుందేమో నని పోతాండా," అంటూ రోడ్డు పైనబడి నడుచు కుంటూ వెళ్లిపోయాడు బీరిగాడు.

"యేమయ్యా, నీకు సెవుల్లో సెట్లేమన్నా మొల్సి నాయా. అబ్బుట్నుంచీ పిలస్తా వుంటే వినబడలే," గుడిసెలో నుంచే కేకేసింది పెద్ద గంగి.

"ఆఁ... ఆఁ... యింటా వుండా సెప్పు," అన్నాడు వెంకటస్వామి.

"సెట్టంత మొగోడివి. ఊరికే కూసోకపోతే అట్ల బొయ్యి ఏదో వాగపని చేసుకోని రాగూడదా. రేత్తిరి నించీ పిల్లోళ్లకు సద్దినీళ్లు గూడా లేవు. యెట్లయ్యా ఈ సంసారం యేగేది," నిష్ఠూరంగా ముక్కు చీదుకుంటూ అంది.

"నువ్వేమీ దిగులుపడొద్దుండే. మొన్న చిన్న కుంట కట్ట మింద వాగ నాలుగు కోమల పుట్ట జూసినా. ఆ పుట్టనిండా పుట్టకూడే. ఆ పుట్ట మీద గెడ్డీ గేదరం చెక్కేసి శుభ్రంజేసి, అన్నినీళ్లు దిమ్మరించి వచ్చినా," తాను చేసి వచ్చిన పనిని గురించి చెప్పాడు.

"ఆ యిసుళ్లన్నా పట్టుకోనిరా పో. వాటిని యేంచి, ఉప్పు కారం బెట్టి అమ్మకొస్తే అంత దుడ్డొస్తాది."

"ముందు కాలంలో అంటే వాటికి మసాలాబెట్టి అటుకుల్లోనో, శనగపప్పుల్లోనో కలిపిస్తే లట్టిలేసు కుంటా తింటావుండ్రి. యిప్పుడు పల్లెల్లో గూడా నాగ రీకం ముదిరిపోయిండాది. యిసుళ్లంటే ముఖం చిట్లించుకుంటా వుండారు."

"సరే, ముందు పోయి పట్టకరాపో. పిల్లోళ్లయినా తింటారు."

"అప్పుడే యెట్ల పట్టకొచ్చేది. యింకా రెండు దినాలుగ్గానీ లెయ్యవు."

"సరే, ఊరికే కూసోక అంతలోపల ఏదో వాగ పనిజెయ్యి," గట్టిగా అరిచినట్టు మాట్లాడింది పెద్దగంగి.

"సరేలేయే, అరసొద్దుగానీ..." అంటూ లేచి గుడిసెలోకి వెళ్లాడు. ఇంతలో కిట్టప్ప వీధిలో నుంచి యింట్లోకి అడుగుపెట్టి, తినడానికేమైనా వుందేమోనని బోకుల్ని వెదకసాగాడు.

"వొరే కిట్టప్పా. యింటెనక పాత బకిట్టుండాది గదా. దాన్నెత్తుకొని రారా. యిసుళ్లు పుట్టకు నీళ్లు పోసొద్దాం," గోడకు వ్రేలాడుతున్న చెక్కస్టాండు వైపు చూస్తూ అన్నాడు వెంకటస్వామి.

ఇసుళ్ల మాట వినగానే సంతోషంగా బకెట్ కోసం పెరటివైపుకు పరిగెత్తాడు కిట్టప్ప.

వెంకటస్వామి చెక్కస్టాండులో వున్న ఒక రేకు డబ్బా మూత తీసి అందులో నుంచి ఒక పామేరు ముక్కనొకదాన్ని తీసుకుని బొడ్లో దోపుకున్నాడు. తలుపు సందున నిలబెట్టి వున్న కోల కట్టె, గోడపైనున్న సలాకీని, సలంకపారను చేతుల్లోకి తీసుకున్నాడు.

''కటవకల్లా బొయ్యి రెండు ఉడతలన్నా యాస కొస్తాంగానీ... కారం నూరుకుని రెడీగా వుండు,'' అంటూ రోడ్లోకొచ్చాడు.

పెరట్లో నుంచీ బకెట్‌ను చేతబట్టుకొని వచ్చిన కిట్టప్ప తండ్రి ననుసరించాడు.

పడమటి నుంచి వీస్తున్న సన్నగాలి రవరవా తోలుతోంది. తొలేటి వానలు పడి వుండడంతో రైతులు చేన్లన్నీ దుక్కిదున్ని పెట్టుకోనున్నారు. భూములు ఇరసాలు కూడా అయిపోయి వున్నాయి. ఏమాత్రం చినుకులు పడినా విత్తనాలేసేయడమే మిగిలింది. ఆరుద్ర దాటిపోతున్నా చినుకు పడడం లేదు. రైతులు ఆకాశంవైపు ఎగచూసుకోనున్నారు.

ఆ చేల దుమ్ములో వెంకటస్వామి, కిట్టప్ప కటవ వైపు నడుస్తుంటే వాళ్ల పాదాల కింద పడిన తువ్వనేల ల్లోని దుమ్ము పిసపిసా పితికిపోయి పక్కలకొస్తోంది. అన్ని ఆయుధాలతో యుద్ధానికి బయలుదేరిన వీర సైనికుల్లా వాళ్లు కటవలోకి అడుగుపెట్టారు. ఆ కటవలో వుండే కానకచెట్లల్లో నుంచి మధ్యవయసులో వున్న ఒక పిచ్చకుంట్లోళ్ల ఆడది, చట్టిలో అన్ని మెతుకు లేసుకొని కావ్‌కావ్ మంటూ అక్కడక్కడా ఆ మెతుకుల్ని విదిలిస్తూ కాకుల్ని పిలుస్తూ వెళుతోంది. ఆమె మెతుకులు వేసిన చోట్లల్లోకి ఒక్కొక్క కాకే చేరి గుంపు కడుతున్నాయి. మెట్ట చేన్లో వలవడ్డి, అది కనిపించ కుండా దుమ్ములో పూడ్చేసి, దానికి కొంత దూరంలో చింతచెట్టు కింద, బిస చేతపట్టుకొని కూర్చొనున్నాడు పిచ్చగుంట్లోడు.

'పిచ్చగుంట్లాడది యాస్తా వుండే మెతకుల కాశ పడి, కాకులన్నీ ఎగురుకుంటా పోయి వల మధ్యలో చేరిపోతాయి. పిచ్చగుంట్లోడు సమయం చూసి చేత నుండే దారంతో బిస లాగేస్తాడు. పాపం, కాకులన్నీ వలలో చిక్కకపోతాయి. ఇంక ఈరోజుకి వాళ్లకు పండగే, వాళ్ల పనే మేలు. వాళ్లకు కాకుల్ని పట్టే విద్దైన్నా తెలుసు,' అనుకుంటూ కటవలో వున్న కానీగ చెట్లవైపు దృష్టి సారించాడు వెంకటస్వామి.

అతని కళ్లు చెట్టు చెట్టుని, కొమ్మకొమ్మను నిశితంగా పరిశీలిస్తున్నాయి.

ఒక్కచోట అతని చూపు ఆగిపోయింది.

అక్కడ... ఒక చిన్న కోతిపిల్ల మాదిరి ఒక చెట్లో నుంచీ మరో చెట్లోకి దూకుతోంది ఉడత.

చేతిలో వున్న కొరముట్లను కొడుకు చేతికిచ్చి, ''నువ్వు యాడనే నిలబడి దానికల్లా చూస్తా వుండు. అది నీ కల్లానే చూస్తా వుంటుంది. నేను ఎనక్కిపోతా,'' అంటూ స్వరం తగ్గించి చెప్పి, కోలకట్టెను తీసుకుని, శబ్దం చేయకుండా మెల్లగా ఆ చెట్ల వెనక్కి వెళ్లాడు. గాలికి కదులుతున్న ఆకుల చప్పుడూ, దూరంగా కాకుల్ని ఆకర్షిస్తూ కా... కా... అంటున్న పిచ్చగుంట్లదాని అరుపులు తప్ప మరే అలికిడీ లేదు.

ఉడత తోకను పైకెత్తి, గొంతును టకటక లాడిస్తూ కిట్టప్పవైపే చూస్తోంది. వెనక్కి వెళ్లిన వెంకట స్వామి చెట్టును సమీపించి వడుపుగా కోలకట్టెతో ఒక్క దెబ్బవేశాడు. అంతే, అది కీచుమని అరుస్తూ నేలపైన గింజుకోసాగింది. కిట్టప్ప గబగబా వెళ్లి దాన్ని పట్టుకొని, చేతిసంచిలో వేసేసుకున్నాడు. అలా కటవలో నాలుగు ఉడుతల్ని కొట్టింతర్వాత బండ కొండ దిగవనున్న చిన్న కుంటలోకి దిగారిద్దరు.

కుంటలో సగంవరకూ నీళ్లున్నాయి. దాని చుట్టూ అక్కడక్కడా తుప్ప చెట్లున్నాయి. దానికొకవైపున కట్ట...

కిట్టప్ప దగ్గరున్న బకెట్‌ను చేతిలోకి తీసుకుని కుంటలోకి దిగి, దాని నిండా నీళ్లు ముంచుకుని కుంట కట్టవైపు నడిచాడు వెంకటస్వామి.

ఇద్దరూ సగం కట్టెపైనున్న పుట్ట దగ్గరికి చేరు కున్నారు.

ఆ పుట్ట అయిదారు కోమలతో నడుములెత్తు వరకు పెరిగి... ఎక్కడో నిర్జరారణ్యంలో ఏ రాజో ఏకాం తంగా కట్టించుకున్న రహస్యస్థావరపు కోటకు చిన్న నమూనాలా కనిపిస్తోంది.

నీళ్ల బకెట్‌ను ప్రక్కనపెట్టి, ఒక కోమలో నుంచీ పుట్టలోకి తొంగి చూశాడు వెంకటస్వామి. కాగులో మగ్గిన దంపుడుబియ్యంలా పుట్టనిండా పుట్టకూడు కనిపించింది.

'ఇదంతా యిడిగితే ఎన్ని ఇసుళ్లో,' అను కున్నాడు.

''నాయనా... యివి యిట్ల నీళ్లు పోస్తా వుంటే ఎన్ని దినాలకు పుడతాయి,'' అడిగాడు కిట్టప్ప.

''మూడు నాలుగు దినాలు పుట్టపైన నీళ్లు పొయ్యాల. అట్ల పోస్తే పుట్టమన్ను నీళ్లను పీల్చుకుం టుంది. నీళ్లు చుక్కలుచుక్కలుగా పుట్టకూటి పైన బడతాయి. అప్పుడు పుట్టకూట్లో నుంచి పురుగులు యిడిగి, వాటికి రెక్కలొస్తాయి. అవే యిసుళ్లు,'' వివరించాడు వెంకటస్వామి.

వాళ్లని చూసి... కట్టపైన వున్న ఒక కానగచెట్టులో నుంచి ఒక కాకి కావ్ కావ్ అంటూ అదేపనిగా అరవ సాగింది. కట్టకవతల బీటిలో ఓ గొర్రెల కాపరి గొర్రెల్ని మేపుకుంటూ కుంట వైపుకు దిగబడుతున్నాడు. వెంకటస్వామి సలాకీని తీసుకుని పుట్ట పక్కన మట్టిని తవ్వసాగాడు.

అది చూసి, "ఎందుకు ఆడ గుంత తొగతా వుండావు," విచిత్రంగా చూస్తూ అడిగాడు కిట్టప్ప.

"పుట్టలోకి ఇంకా బాగా నీళ్లు దిగి బిరీనా యిసుళ్లు పుట్టేదానికి," తవ్వుతూనే సమాధానం చెప్పాడు వెంకటస్వామి.

గజం పొడువు వెడల్పుతో గుంత తవ్వి మట్టి పక్కలకు ఎగదీశాడు. ఆ తర్వాత బకెట్‌లో వున్న నీళ్లను ఆ గుంతలో పోశాడు. కిట్టప్ప చేత కుంటలో నుంచి బకెట్‌తో అయిదారుసార్లు నీళ్లు తెప్పించి పోయించాడు. చివరన మరో బకెట్ నీళ్లను పుట్టపైన చల్లాడు.

"ఇసుళ్లు యిడిగినాంకా అవి బయటికొస్తాయి గదా. వాటిని ఎట్ల పట్టుకునేది?" ఉడతల సంచిని ఎత్తుకుంటూ అడిగాడు కిట్టప్ప.

"ఇసుళ్లు పట్టేది రేతిర్లో వొగ తీరుగానూ, పొగులు వొగ తీరుగానూ వుంటుంది," అన్నాడు కొరముట్లు చేత బట్టుకుంటూ వెంకటస్వామి.

"అదే యెట్లా?"

"పద చెప్తా," అంటూ అక్కడి నుంచీ బయలు దేరుతూ చెప్పసాగాడు వెంకట స్వామి.

"ఇసుళ్లు పూర్తిగా యిడిగింతర్వాత కోమలన్నీ మూసేసి, ఒకే ఒక దారి పెడతాం. పుట్టపైన ఆకుతో గూడు చేసి, ఆ గూట్లో దీపం పెడతాం. ఆ దీపం కింద ఒక దబిరో, తగారో యేదోవొగిటి పెట్టి దీపం ముట్టిస్తాం. అంతే, ఆ ఎల్తురుకు పుట్టలో ఇసుళ్లు బయటికొచ్చి, దీపం చుట్టూ తిరిగి, రెక్కలు విరిగి అన్నీ ఆ దబిర్లో పడిపోతాయి. ఇది రేత్తిర్లో పట్టే మార్గం."

ఊరివైపు నడుస్తూ చెప్తుంటే కిట్టప్ప అతని వెనక నడుస్తున్నాడు. అప్పుడే ఆకాశంలో లేచిన అరచేయంత కర్రిమేఘం వాళ్లను చూసి వెర్రిగా నవ్వుకోసాగింది. దారి పక్కనున్న ఓ కంపచెట్టు పైన రెండుముక్కలై వ్రేలా డుతూ గాలికి కదులుతున్న పాముపొర వైపు చూస్తూ, "మరి పొగులు?" అనుమానం వ్యక్తం చేశాడు కిట్టప్ప.

"పొగులయితే దీపంతో అవసరంలే."

అలా మాట్లాడుకుంటూ వాళ్లు ఇల్లు చేరేసరికి వీధి రోడ్లో గవర్నమెంటు జీపొకటి... రాత్రివేళ గొర్రెల మందపైన దాడి చేయడానికి పొదచాటున గుమ్మనంగా దాగి, పొంచి వున్న కొర్నంపోతులా చింతచెట్టు కింద ఆగి వుంది. దాని చుట్టూ జనం చేరి వున్నారు.

మండలాఫీసు నుంచి వచ్చిన ఉద్యోగస్తులు కొందరు ఏదో చెబుతున్నారు.

"వొరే కిట్టా, నువ్వు యింటికి పద," అంటూ కొర ముట్లన్నీ అతని చేతికిచ్చి పంపేసి వాళ్లను సమీపిం చాడు వెంకటస్వామి.

"య్యేవ్. మీకిదివరకే చాలాసార్లు చెప్పినాము. నోటీసులిచ్చినాము. పట్టించుకోలే. రేపు మద్దేనాళకు మీ యిండ్లు ఖాళీచేసి యింకేడన్నా కట్టుకోండి. ఇది సర్కా రార్డరు. ఇంక చెప్పేదేముండదు," ఒక ప్యాంటూ షర్టు గట్టిగా అరిచి చెబుతోంది.

"కాలనీ యిండ్లున్నోళ్లు ఆడికిపోతారు. లేనోళ్లు యాడికి పోవల్ల?" ఒక చొక్కాలేని బక్క శరీరం అడుగు తోంది.

"ఆపక్కనుండే కటవ పోరంబోకు. ఆడికి బొయ్యి కట్టుకోండి," మరో టై బిగించిన మెడ చెబుతోంది.

"వొగబ్బుడు ఆడ యాడనో వున్న యిండ్లు ఖాళీ చేయించి ఇట్లనే జెప్పి యాడికి తరిమిరి. ఇప్పుడు యింకేడికో తరిమేయాలని చూస్తా వుండారు. మమ్మ ల్నిట్ట బతకనియ్యరా యేందీ?" ఓ ముసలి ఆకారం ఎగిరెగిరి పడుతోంది.

"కూటికే కనా కష్టంగా వుండాది. వున్నిట్టుండి పొమ్మంటే ఎట్లా?"

"మాకూ యాడన్నా ఇండ్లు కట్టించండి. పోతాం."

పీక్కుపోయిన మొహాలు ఒకటి తర్వాత ఒకటిగా అడుగుతున్నాయి.

"అయ్యా, యిండ్లు లేనోళ్లకు త్వరగా యిండ్లు కట్టిస్తాం. బాకరాపేట నుంచి మీ వూరి ముందరి వరకూ పనైపోయి వుంది. మిగిలింది మీ వల్లనే ఆలస్యం. మాకు పై నుంచి ఆర్డర్లొచ్చినాయి. వత్తిడి ఎక్కువగా వుంది."

"ఆ కాలనీ యిండ్లల్లోనే ఎట్లనో వొగట్ల కొన్ని దినాలు సర్దుకుంటే, కొత్త గవర్నమెంటు అందరికీ యిండ్లు కట్టిస్తుంది."

ప్యాంటూ షర్టులు మార్చిమార్చి చెబుతున్నాయి.

అదంతా విన్న వెంకటస్వామి, 'యింకెట్లరా భగ మంతుడా,' అనుకుంటూ తన గుడిసె వైపుకు నడిచాడు.

ఆఫీసర్లతో నిండిన జీపు తిరుపతివైపుకు బయలు దేరింది. సంవత్సరం నుంచి వీళ్లు ఇట్లనే చెబుతున్నార్లే అనుకుంటూ జనం ఎవరిండ్లకు వాళ్లు వెళ్లిపోయారు.

ఆ మరునాడు మళ్లీ వెళ్లి పుట్టపైన నీళ్లు చల్లి తవ్వినగుంతలో నీళ్లు పోసి వచ్చాడు వెంకటస్వామి. ఆ తేమకు పుట్టకూటిలో కదలిక రాసాగింది.

*

మూడోరోజు... ఉదయమంతా నిమ్మళంగా వున్న ఆకాశంలో మెల్లగా మేఘాలు ప్రారంభమయ్యాయి. అవి ఒకదానికొకటి దడిగట్టి, ఆ దడి మధ్యాహ్న సమయానికి ఆకాశాన్ని కప్పేసింది.

'వొరొరే, మూడు దినాల నుంచీ కుంట కట్టన పుట్ట మీద నీళ్లు పోస్తా వుండానే. ఈ వేళకు పురుగులకు రెక్కలొస్తా వుంటాయి. రేత్తిరికి బొయ్యి పట్టుకుందామనుకున్నా. ఇప్పుడు గనక వానబడిందా, అంతే. అన్నీ బయటికొచ్చేస్తాయి. వానకంటే ముందే... మనమే బొయ్యి యిసుళ్లు పట్టుకోవాల.'

గుడిసె లోపల నుంచి వెలుపలికొచ్చిన వెంకటస్వామి ఆకాశంవైపు ఒక్కసారి చూసి, వీధిలో ఆడుకుంటున్న కొడుకును పిలిచాడు. తండ్రి కేక విని పరిగెత్తుకుంటూ వచ్చి, "ఏమి నాయనా," అన్నాడు కిట్టప్ప.

"తలుపు సందులో సంచుంది తీసుకో..." పురమాయించాడు వెంకటస్వామి. కిట్టప్ప సంతోషంగా గుండీలు లేని చొక్కాని ముందుకు లాక్కుంటూ వెళ్లి తలుపు సందున... యూరియా గోతంతో కుట్టిన చేతిసంచిని తీసుకున్నాడు.

వెంకటస్వామి మళ్లీ లోపలికి వెళ్లి డబ్బాలో వున్న పామేరునొకదాన్ని తీసుకుని బొడ్లో దోపుకున్నాడు. గోడపైనున్న సలాకీని, సలంక పారను తీసి చేత బట్టుకుని పెరట్లోకి నడిచాడు. అక్కడున్న బకెట్‌ను తీసుకొచ్చి కొడుకు చేతికిచ్చి, "యింక రారా," అంటూ కుంట వైపుకు బయలుదేరాడు.

కుంట మొగదలకు పోగానే, అక్కడే ఒకచోట వున్న సీతాఫలం చెట్టు కొమ్మల్ని సందెడు నరికి వాదె చేసుకుని, అన్నీ పుట్ట దగ్గరికి చేర్చాడు.

"వొరే కిట్టా, నువ్వు కుంటలోకి పోయి బకెట్టుతో నీళ్లు తీసుకరాపో," బకెట్ ఆతని చేతికిచ్చి పంపి, వంగి ఒక పుట్టకోమలో నుంచి పుట్టలోకి తొంగి చూశాడు.

పుట్టలో కుప్ప తెప్పలుగా కదులుతున్న యిసుళ్లు.

'అన్నీ యిడిగిపోయింటాయి. పుట్టకోమలన్నీ మూసేస్తే, ఊపిరాడక పైకొచ్చేస్తాయి,' అనుకుని, పైకి లేచి, పక్కనున్న గుంతవైపు చూశాడు. గుంతలో నిన్న పోసిన నీళ్లు ఇంకిపోయి వున్నాయి. సలంకపార తీసుకుని వెళ్లి ఆ గుంతలో నుంచి పారమన్ను తీసుకుని, ఆ మట్టితో పుట్టకోమల్ని మూసేశాడు. ఆ మేరకు కిట్టప్ప బకెట్‌తో నీళ్లు తెచ్చి పెట్టగానే, ఆ నీళ్లను పుట్టపైన చల్లాడు. ఆ తర్వాత సీతాఫలం ఆకులు పుట్టపైన పరచి, పారతో ఆకులపైన మట్టి చల్లి, పుట్టను పూర్తిగా కప్పేశాడు.

సీతాఫలం ఆకుల వాసన మెల్లగా గాలిలో వ్యాపిస్తోంది. నీళ్లతో మెత్తగా తడిసిన పుట్టమన్నులో నుంచి నీళ్లు పుట్టలోకి జారసాగాయి.

వెంకటస్వామి బొడ్డులో దోపుకొనున్న ఒక బీడీని, అగ్గిపెట్టెను తీసి, బీడీని నోట్లో పెట్టుకున్నాడు. అగ్గిపుల్ల గీసి బీడీని వెలిగించుకుని అగ్గిపెట్టెను కొడుకు చేతికిచ్చి, బీడి పొగను గుండెల వరకూ పీల్చి వదుల్తూ... ఆకాశం వైపు చూశాడు.

పడమటి దిక్కున... ఆకాశంలో వానమబ్బు నల్లగా కనిపిస్తోంది. ఆ నల్లదనం ఆకాశం నుంచి చారలుచారలుగా నేలపైకి జారుతున్నట్లు కనిపించసాగింది. అది గమనించిన వెంకటస్వామి గబగబా రెండు దమ్ములు పీకి, బీడీ ఆర్పి, ఆ ముక్కను చెవిలో యిరికించుకుని, 'వాన దిగబడింది. బిరీనా పట్టేయాల,' అనుకుంటూ తన రెండు చేతులతో పుట్టను తాకాడు.

అతనికి ఆవేళ అది వెలలేని నిధిని దాచుకున్న స్వర్ణపేటికలా అనిపించింది. బొడ్లో దోపుకొనున్న పామేరు ముక్కను తీసి నోట్లో వేసుకుని నముల్తూ, దాని రసాన్ని మింగుతూ, సలాకీని తీసుకుని పుట్ట అడుగు భాగాన చేయి పట్టేటంత రంధ్రం చేశాడు. తవ్వగా వచ్చిన మట్టిని పక్కకు లాగి, చేతిని పుట్టలోకి దోపాడు.

పుట్టలో పురుగుల సంచలనం... బుసబుస అన్న శబ్దం...

"పుట్టలో నుంచి బుస వినిపిస్తా వుండాది నాయనా. పురుగుల్ని మింగేదానికి పాము చేరుకున్నట్టుండాది. భద్రం," హెచ్చరించాడు కిట్టప్ప.

"పామేం చేస్తుందిరా. పాముల కెరుసుకుంటే యానాదోడు సచ్చినట్టే. అయినా పామేరు నోట్లో వుండాది గదా, పాము కరిసినా యిసమెక్కదులే," అంటూ చేతిని అటూ ఇటూ కదిలించాడు.

చేయికి తగిలి ఇసుళ్లు గిలిగింతలు పెట్టాయి. చేతిపక్క నుంచి ఇసుళ్లు వెలుపలికి రావడానికి ప్రయత్నిస్తున్నాయి.

"బయటికొచ్చేస్తే ఇసుళ్లు యాడంటే ఆడ బోతాయిగానీ, సంచి రెడీగా పట్టుకోరా. చేత్తో తీసితీసి యాస్తా," అన్నాడు వెంకటస్వామి.

కిట్టప్ప తన రెండు చేతులతో సంచి అంచుకున్న నాడాలు పట్టుకుని పుట్ట దగ్గరికి వెళ్లి నిలబడ్డాడు.

వెంకటస్వామి పిడికెటితో ఇసుళ్లను పట్టుకున్నాడు. ఇసుళ్లతో బాటు చేతికి ఏదో మెత్తగా తగిలింది.

అతనికి అనుమానమే. చేతిని అలాగే పైకి లాగాడు. అంతే, బుసలు కొడుతూ చేతిలావు పాము పైకొచ్చి ఆతని చేతి బొటనవేలిపైన కొరికింది.

''వోయమ్మో,'' అంటూ కిట్టప్ప దూరంగా పరిగెత్తాడు.

'దీనెమ్మా,' అంటూ పామును దూరంగా విసిరేసేశాడు వెంకటస్వామి. అది ప్రాణభయంతో చెట్లల్లో దూరి, కట్ట కిందికి దిగి పరిగెత్తింది.

''జెర్రిపోతుముండ,'' పామును అశ్లీలంగా తిట్టుకుంటూ, అది కొరికిన వేలిపైన రుద్ది, వేలిని ఒక్కసారి చూసుకున్నాడు.

వేలిపైన రెండు బలమైన గాట్లు... ఆ గాట్ల నుంచీ రక్తం కమ్మింది.

''నాయనా... ఏంగాదు గదా,'' దగ్గరికి వచ్చి చూస్తూ ఆందోళనగా అన్నాడు కిట్టప్ప.

''అది మామూలు జెర్రిపోతు. ఏంగాదులే. అదే పెంజిరయింటే ఈ యేలకు కైలాసమే...'' గాట్లపైన వ్రేళ్లతో నొక్కి, రక్తం చుక్కల్ని తుడిచేస్తూ అన్నాడు వెంకట స్వామి.

''నాగుబాము మాదిరుండాదే,'' సందేహం వెలిబుచ్చాడు కిట్టప్ప.

''పైకి రెండూ వొగిటిగానే వుంటాయి. కానీ నాగుబాము యిట్టా పరిస్థితిలో మనిషిని చూస్తానే పడగెత్తతాది. దాని గొంతు కింద తెలుపు నలుపు మచ్చలుంటాయి. పడగెత్తితే అవి ఎంకటేస్సుని నామాలు మాదిరి కనిపిస్తాయి. ఇది పడగెత్తలేంది. పైగా దీని తల కొంచెం ఎరుపుగాను, పెద్దదిగానూ వుంటుంది. సరే, సంచి పట్టకరా,'' వివరంగా చెప్పాడు.

కిట్టప్ప సంచి పట్టుకొని యింకా దగ్గరికి వెళ్లాడు.

పాము కొరికిన వేలు మంటతో నొప్పి పెట్టసాగింది. నోట్లోని పామేరు రసాన్ని గబగబా కడుపులోకి మింగాడు.

అప్పటికే ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైపోయిన ఇసుళ్లు బయటికొస్తున్నాయి. వెంకటస్వామి పుట్టలోకి చేయి పెట్టి పిడికిలితో పట్టిపట్టి ఇసుళ్లను సంచిలో వేస్తున్నాడు.

''యేం నాయనా, పాముని వూరికే యిడిసిపెట్టేస్తివే. పట్టుకోని శరమ్ము దీసింటే... అమ్ముకోనుండచ్చుగదా,'' అన్నాడు కిట్టప్ప.

''అడవుల్లో జంతువుల్ని, పాముల్ని పట్టినా, శరమ్ము దీసి అమ్మినా సర్కారోళ్లు జైల్లో పెడతారంట్రా. అందునా యిప్పుడు పాము శరమ్మాలు దీసుకునేవోడే లేకపాయ. ఎందుకొచ్చిన గొడవనీ వదిలేస్తి...'' చెప్పాడు వెంకటస్వామి.

అలా మాట్లాడుకుంటూ ఇసుళ్లను తోడితోడి సంచిలో పోశాడతను. చివరన సలాకీతో పుట్టను తవ్వి తవ్వి మిగిలిన ఇసుళ్లను వెదికివెదికి సంచిలో వేసేసుకుని ఏదో సాధించినట్లు విజయగర్వంతో పైకి లేచాడు.

ఎదురుగా... మకరందాన్నంతా పీల్చేసిన పొగరుబోతు తుమ్మెద ధాటికి నలిగిపోయిన పువ్వులా... శత్రువుల దాడిలో పూర్తిగా నాశనమైపోయిన కోటలా... శిథిలమైన పుట్ట...

దూరంగా... నల్లటి మేఘాన్ని కప్పుకొని గుంభనంగా పడుకున్న పెద్ద రాకాసిలా బండకొండ...

పాము కరిచిన వేలు నిప్పు మండినట్టు మండుతూనే వుంది. అయినా ఆతను లెక్కచేయడంలేదు. నోట్లో వున్న పామేరు కూడా నమిలినమిలి ఎప్పుడో కరిగిపోయింది.

అంతవరకూ పడిన శ్రమ నుంచి ఉపశమనం పొందుతూ ఒక్కసారి గుండెల నిండా గాలి పీల్చుకొని వదిలి, కొరముట్లను కిట్టప్ప చేతికిచ్చాడు. ఇసుళ్ల సంచి మూతి బిగించి కట్టి భుజాన వేసుకుని, 'రా రా' అంటూ కొడుకుని వెంటబెట్టుకొని ఊరివైపుకు బయలుదేరాడు.

అప్పుడే సరిగ్గా పడమటి దిక్కున మేఘాల్లో తళుక్కున ఒక్క మెరుపు మెరిసింది. ఎక్కడో దూరంగా ఉరిమిన శబ్దం స్పష్టాస్పష్టంగా వినిపించింది. మెల్లగా చినుకులు ప్రారంభమయ్యాయి.

*

వెంకటస్వామి ఊరు చేరేటప్పటికి అక్కడ వాతావరణం చాలా బీభత్సంగా వుంది.

''అయ్యో, మేమెట్లా బతికేదిరా దేముడా!'' గుండెలు బాదుకుని ఏడుస్తున్నారు కొందరు.

''బతికేదానికి దోవ సూపెట్టరుగానీ, వుండే తావును కూల్చేస్తారా?'' మొలవస్త్రంతో నిలబడ్డ ముసలతనొకడంటున్నాడు.

''కాపాడాల్సినవోళ్లే కాల్చుక తింటే, యింక సెప్పుకునే దానికేముండాది?'' ఓ చింపిరిజుట్టు ఆక్రోశిస్తోంది.

అక్కడ జనం గుంపు.

అందులో కొందరు పిల్లలు భయంభయంగా చూస్తూ నిలబడి వున్నారు. వృద్ధులు రోదిస్తున్నారు. ఆడవాళ్లు జుట్లు పీక్కుని, రొమ్ములు బాదుకుంటూ శాపనార్థాలు పెడు తున్నారు.

కొందరు తమ బోకీ బోలె రోడ్డుపైనే పెట్టుకున్నారు. ఇంకొందరు అక్కడే వున్న చింతచెట్టు కిందికి చేరుకుని తమ వస్తువుల్ని భద్రపరచుకుంటున్నారు. ఇంకొందరు తమ పెట్టేబేడా కాలనీ యిండ్లల్లోకి మోసుకు వెళుతున్నారు.

ఒక ప్రొక్లెయినర్, రెండు జేసీబీలు గుడిసెల్ని తోసితోసి నేలమట్టం చేస్తున్నాయి. ఒక పోలీసు జీపు,

మరో రెండు కార్లు రోడ్డుకు వారగా పార్క్ చేయబడి వున్నాయి. వాటి ముఖాల మీద 'ప్రభుత్వ వాహనం' అన్న అక్షరాలు దయ్యపు కండ్లల్లా కనిపిస్తున్నాయి. కొందరు పోలీసులు జనాలను కంట్రోల్ చేస్తుంటే, మరి కొందరు అధికారులు దగ్గరుండి గుడిసెల్ని తోయిం చేస్తున్నారు.

గుడిసెవాసుల ఏడుపులు, అధికారుల అదిలింపులతో అక్కడొక యుద్ధ వాతావరణం అలుముకొని వుంది.

"ఈ రోడ్డును హైరోడ్డు చేసినారు. డబుల్ రోడ్డు బాకరాపేట దాకా వచ్చేసింది. ఈ ఇండ్లే అడ్డు. సంవత్సరంగా చెబుతూనే వున్నారు. నోటీసులు యిస్తూనే వున్నారు. వీళ్లు వింటే కదా," ఓ వ్యక్తి ఎవరికో చెబుతున్నాడు.

"రోడ్డు వెడల్పు చేస్తే ప్రజలకే గదా మేలు," ఖరీదయిన ప్యాంటూ షర్టుతో తన దేహాన్ని సింగారించుకున్న మరో వ్యక్తి అంటున్నాడు.

'రోడ్లు పెద్దవిజేస్తే ఎవురికి లాభం. అసలు చాలా మందికి కాలనీలో యిండ్లు లేవే. ఇప్పుడు వాళ్లంతా ఎక్కడికి పోతారు. యాడ తలదాచుకుంటారు?' ఆ దృశ్యం చూస్తూ ఆలోచన్లో పడిపోయాడు వెంకటస్వామి. వేలు కత్తితో కోసినట్టు జివ్వున లాగుతోంది. మాటిమాటికీ వేలిని రుద్దకుంటూనే వున్నాడు. వేలు కాస్తా వాచి కూడా వుంది.

ఒక లారీ రొద చేసుకుంటూ అక్కడి సంఘటనతో తనకేమీ సంబంధం లేనట్టు మనుషుల్ని దాటుకుని వెళ్లిపోయింది.

అప్పటికే అక్కడి పరిస్థితితో పాటు వాతావరణమూ మారిపోయింది. ఉరుములు, మెరుపుల్తో బాటు గాలి ఎక్కువైంది.

కిట్టప్ప తండ్రి చేయిని గట్టిగా పట్టుకున్నాడు.

తుంపర జోరు కాస్తా పెరిగింది.

పల్లె ప్రజలు పిల్లాజల్లల్తో అలాగే నిలబడి తడుస్తుంటే... అధికారుల నెత్తిన మాత్రం గొడుగులు మొలుచుకొచ్చాయి.

వెంకటస్వామి గుడిసె ఎప్పుడో నేలమట్టమైపోయి వుంది. ఆతని కళ్లు గుడిసె కోసం వెదకసాగాయి.

ఆ ప్రదేశమంతా కూలిన గోడలతో, చిందరవందరైన గడ్డికప్పులతో బీభత్సంగా కనిపిస్తోంది.

ఆ సంఘటన కలిగించిన అయోమయ స్థితి నుంచి మామూలుగా రావడానికి ఆతనికి కొన్ని క్షణాలు పట్టింది.

'ముందెప్పట్నుంచో పేట కానుకోనున్న గుడిసెలు, పేటపెరిగే కొద్దీ కాలనీ యిండ్ల కాడికొచ్చినాయి. ఇప్పుడు ఈ గుడిసెల్నీ తోసేసిరి. ఈ కాంక్రీటు మిద్దెలు, తారురోడ్లు రానురాను మమ్మల్ను యింకా దూరంగా తోసేస్తా వుండాయి. కడాకు మీరు అడవుల్లో వుండేవోళ్లు, మళ్లా అడవుల్లోకి పోండి... అంటారేమో? ఆ అడివిలోనైనా మమ్మల్ని బతకనిస్తారా? అడవుల్లో తిరిగే జీవాలకు సంరక్షణ కలిగించే ఈ గవురుమెంటు, అడవుల పైనబడి బతికే మమ్మల్ని మాత్రం పట్టించుకోదు. ఆపాటి యిలవ కూడా మాకు లేదా?' ఆలోచిస్తూ తన గుడిసె శిథిలాలవైపు రెండడుగులు వేశాడు.

"నాయనా... నాయినా... యాడికి రా..." అన్న పిలుపుతో అలాగే నిలబడిపోయి, ఆ పిలుపు వినిపించిన వైపు చూశాడు.

దూరంగా వున్న చింతచెట్టు కింద వస్తువుల మధ్య పెద్ద గంగి కూర్చొని వుంది. ఆమె పక్కనే నిలబడి వున్న శాంతమ్మ తననే పిలుస్తోంది.

నిప్పుతో కాల్చినట్టు వేలి సలపరం యింకా ఎక్కువ కాసాగింది. అయినా అక్కడ జరిగిన ఆ సంఘటన వల్ల కలిగిన బాధ వేలి బాధ కంటే ఎక్కువగా వుంది.

అప్రయత్నంగానే ఆతని కాళ్లు చింతచెట్టు వైపు కదిలాయి. ఆ సమయంలోనే ఆకాశంలో ఒక తీగె మెరుపు... అంతటి వెలుగును భరించలేక ఒక్కక్షణం కళ్లు మూసుకుని తెరిచాడతను.

ఎదురుగా... కూలిపోయిన తన గుడిసె గోడల పెళ్లల కుప్ప కనిపించింది. అదే సమయంలో... కొంత సేపటి క్రితం తాను ఇసుళ్లు పట్టేసి, తవ్వేసి వచ్చిన పుట్ట శిథిలాలు గుర్తుకు వచ్చి, వెక్కిరిస్తున్నట్లనిపించింది.

మళ్లీ ఆకాశంలో మెరుపుల కొరడా...

ఆ వెంటనే భూనభోంతరాలు దద్దరిల్లేటట్లు దూరంగా పిడుగుపడింది. భయంతో వణికిపోతూ అలాగే నిలబడిపోయాడు వెంకటస్వామి.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 13 ఆగస్టు 2006*

